క్లుప్తంగా

టీకా నిల్వ కేంద్రాల్లో తనిఖీ

కల్లూరు: మండలంలోని కల్లూరు, చెన్నూరు ప్రభుత్వ ఆస్పత్రులను జిల్లా వ్యాక్సిన్ మేనేజర్ సీహెచ్‌వీ. రమణ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాక్సిన్ల నిల్వలు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తూ వాక్సినేషన్ లక్ష్యాన్ని వంద శాతం చేరుకోవాలని తెలిపారు. వైద్యులు నవ్యకాంత్, తబుషం, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుప్పెనకుంట్లలో ఆర్డీఓ పర్యటన

పెనుబల్లి: మండలంలోని కుప్పెనకుంట్లలో కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్ బుధవారం పర్యటించి.. ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించారు. రామచందర్‌రావుబంజర్, కుప్పెనకుంట్ల, కేడబ్ల్యూ చౌడవరం, తాళ్లపెంట గ్రామాల్లో.. ఎంపీడీఓ అన్నపూర్ణ, ఆయా శాఖల అధికారులతో కలిసి లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య

ఏన్కూరు: ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య దొరుకుతుందని ఏన్కూరు జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మీటకోటి సింహాచలం అన్నారు. ఈ ఏడాది మార్చి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ప్రచార పత్రాలు ముద్రించి ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్నారు. అధ్యాపకులు సుందర్, కృష్ణప్రసాద్, బాబు లాల్, రామారావు, వెంకటేశ్వర్‌రావు, విజయలక్ష్మి, లక్ష్మీనర్సింహా, రమాదేవి, కిషోర్, రాజన్న, శివ పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బోనకల్: మండల కేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన వడ్డెపూడి ఉపేందర్ ఆటోలో వెళ్తుండగా బోనకల్ నుండి చొప్పకట్లపాలెం వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో ఉపేందర్, బైక్‌పై వెళ్తున్న నల్లబోయిన ప్రవీణ్, షేక్ నజీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని 108లో ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కేసు నమోదు

బోనకల్: మండల కేంద్రంలోని రైల్వే కాలనీలోని బానోత్ కిరణ్ మోటార్‌సైకిల్ గత నెల 29న ఇంటి ఆవరణలో ఉంచగా.. రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను అపహరించారు. ఈ విషయంపై బాధితుడు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పోదిలి వెంకన్న తెలిపారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

చింతకాని: పాక్షిక పక్షవాతం, శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపిస్ట్ వల్లూరి వసంత తెలిపారు. మండలంలోని వందనం గ్రామంలో ప్రత్యేక అవసరాలు కల్గిన దివ్యాంగ పిల్లలకు బుధవారం ఫిజియోథెరపీ వైద్య సేవలు అందించారు.

ఉద్యమకారుల బయోడేటా సేకరణ

ఏన్కూరు: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం మండలంలోని తెలంగాణ ఉద్యమకారుల బయోడేటా సేకరణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత తెలంగాణ ఉద్యమంలో పాల్గొని చనిపోయిన ముగ్గురు ఉద్యమకారులకి సంతాపం వ్యక్తం చేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. 8 నుంచి బయోడేటా సేకరించారు. టీజేఏసీ మండల కన్వీనర్ గిద్దగిరి సత్యనారాయణ, ఇంజం దేవదాస్, తాళ్లూరి వెంకటప్పయ్య, కొంటు సాంబయ్య, దేశిని గణేష్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మధిర: రాయపట్నం రైతు వేదికలో విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ రైతు వేదికకు వచ్చే విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాయపట్నం, ఇల్లూరు, దేశినేనిపాలెం గ్రామాల నుంచి కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన రైతు నమోదుకు వచ్చిన రైతులు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఫ్యాన్లు పనిచేయక తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

సన్మానం..

తల్లాడ: విశిష్ట సేవలందించినందుకు గాను తల్లాడ మండలం నూతనకల్‌కు చెందిన వంగూరి వెంకటేశ్వర్‌రావును మానవ హక్కుల పరిరక్షణ ప్రజా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి సన్మానించారు. సత్తుపల్లిలో మానవ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన సభలో గత 18 సంవత్సరాలుగా అనాథ శరణాలయం నిర్వహిస్తూ సేవలందించిన వెంకటేశ్వర రావును మానవ హక్కుల పరిరక్షణ సమితి చైర్మన్ చలమల హైమావతి శాలువాతో సత్కరించి మెమెంటో, ప్రసంపా పత్రం అందజేశారు.

వెలగని సెంట్రల్ లైట్లు


వీయంబంజర్ రింగ్ సెంటర్‌లో వెలగని లైట్లు


పెనుబల్లి - బయ్యన్నగూడెం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై


మరమ్మతులకు నోచుకోని స్తంభాలు

- అంధకారంలో జాతీయ రహదారి
- టోల్ ఫీజు వసూలు చేస్తున్నా.. సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం
- పట్టించుకోని ఏజెన్సీ నిర్వాహకులు

పెనుబల్లి: జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ వ్యవస్థ నిర్లక్ష్యానికి గురవుతోంది. విజయవాడ నుంచి జగదల్‌పూర్ వెళ్లే జాతీయ రహదారి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మీదుగా సుమారు 200ల కిలోమీటర్ల మేర ఉంది. దీనిలో ఖమ్మం జిల్లాలోని పెనుబల్లి మండలం ముత్తగూడెం నుంచి కొత్తగూడెం వరకు జాతీయ రహదారి నిర్వహణకు మధ్యలో పెనుబల్లి మండలంలోని గౌరారం వద్ద టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసి వాహనదారుల నుంచి ఫీజు వసూలు చేస్తున్నారు.

సౌకర్యాల కల్పనలో నిర్లక్ష్యం..

వచ్చే ఆదాయంతో నేషనల్ హైవే అథారిటీ ఓ ప్రైవేట్ సంస్థకు రోడ్డు మరమ్మతులు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు, నిర్వహణ, లైటింగ్ విద్యుత్ బిల్లుల చెల్లింపు, రోడ్డుపక్కన ఉన్న చెట్లను తొలగించడం, రోడ్డుపై ప్రమాదాలు జరిగినప్పుడు ఆ వాహనాలను తొలగించడం వంటి పనులను అప్పగించింది. ఆ ఏజెన్సీ చేసే పనులను ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సైతం పర్యవేక్షించాల్సి ఉన్నా.. వారి నిర్లక్ష్యంతో కాంట్రాక్ట్ దక్కించుకున్న ఏజెన్సీకి వరంగా మారింది. దీంతో నెలల తరబడి సెంట్రల్ లైటింగ్ లైట్లు వేయకుండానే ఏజెన్సీ నిర్వాహకులు కాలం గడుపుతూ వారు పొందే బిల్లులను మాత్రం క్రమం తప్పకుండా పొందుతున్నారు.

మొక్కుబడిగా పనులు..

కొన్ని సందర్భాల్లో స్థానికులు ఆందోళన చేసిన సమయాల్లో మొక్కుబడిగా ఓ వారం రోజుల పాటు వెలిగేలా చూడటం, మళ్లీ యథావిధిగా అంధకారంలోనే జాతీయ రహదారిని ఉంచటం పరిపాటిగా మారింది. వర్షాకాలం ఈదురు గాలుల సమయంలో రోడ్లపై పడిన చెట్లను, ప్రమాదాల జరిగిన సమయంలో రోడ్డుపై ఉన్న వాహనాలను, పశువులను తొలగించాల్సిన బాధ్యత ఈ ఏజెన్సీకే ఉన్నప్పటికీ, మొక్కుబడిగా రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించినట్లు చేస్తూ బిల్లులు పొందుతున్నారు. సంబంధిత అధికారులు దీనిపై దృష్టిసారించి సెంట్రల్ లైటింగ్ వెలిగేలా చూడాలని, రోడ్డు మెయింటినెన్స్ పనులు పకడ్బందీగా జరిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

మండలంలో ఏర్పాటు చేసిన లైట్లు..

పెనుబల్లి మండలంలోని ముత్తగూడెంలో కిలోమీటరు మేర, బయ్యన్నగూడెం నుంచి వీయంబంజర్, పెనుబల్లి వరకు 4కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్‌తో పాటు వీయంబంజర్ రింగ్ సెంటర్‌లో భారీ హై మాస్క్ లైట్లు ఏర్పాటు చేశారు. వీటితో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డి మండల పరిధిలోని ఎర్రగుంటలో సుమారు 3 కిలోమీటర్లు, చంద్రుగొండ మండల కేంద్రంలో 3 కిలోమీటర్ల మేర సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశారు.

చీకట్లోనే ప్రయాణాలు..

ఆయా గ్రామాల్లో లైట్లు అయితే ఏర్పాటు చేశారు గానీ.. ఒక్కలైటు కూడా వెలగక సుమారు ఆరునెలలు దాటింది. దీంతో నిత్యం రద్దీగా ఉండే జాతీయ రహదారిపై రాత్రి సమయాల్లో ప్రయాణాలు సాగించే వాహనదాలు ప్రమాదాలకు గురైన సంఘటనలు అనేకం.

ప్రమాదాలు జరుగుతున్నాయి..



జాతీయ రహదారి పక్కన పెనుబల్లిలో సెంట్రల్ లైటింగ్ వెలగడం లేదు. చీకటి వల్ల రాత్రి వేళల్లో బొగ్గు లారీలు తరుచూ యాక్సిడెంట్లు చేస్తున్నారు. ఏడాది నుంచి సెంట్రల్ లైట్లు వెలగడం లేదు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఉపయోగం లేదు.. ఇకనైనా లైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలి.

– కాటిని చెన్నకేశవ, పెనుబల్లి

త్వరలో మొదలు పెడతాం..

ఎన్‌హెచ్‌ఏఐ సంస్థ కొత్తగా గత ఫిబ్రవరిలో మెయింటినెన్స్ ఏజెన్సీని నియమించింది. ఈ ఏజెన్సీ ద్వారా త్వరలో లైట్లు వెలిగెలా చర్యలు తీసుకుంటాం. చంద్రుగొండలో ఇప్పటికే లైటింగ్ పనులు మొదలు పెట్టి లైట్లు వెలిగేలా పనులు చేపడుతున్నాము.

– కిరణ్, ఎన్‌హెచ్‌ఏఐ సైట్ ఇంజనీర్

వాసవీమాత జయంతి వేడుకలు


సత్తుపల్లి: మహిళలను సత్కరిస్తున్న వాసవీక్లబ్ నిర్వాహకులు


మధిర: పతాకావిష్కరణ చేస్తున్న దృశ్యం

సత్తుపల్లి: సత్తుపల్లి శ్రీకోదండ రామాలయంలో వాసవీక్లబ్ గ్రేటర్ ఆధ్వర్యాన వాసవీమాత అమ్మవారి జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మైసూర్ దత్తపీఠంలో గీతా ప్రవచనాలు చెప్పి ప్రశంసాపత్రాలు అందుకున్న 17 మంది మహిళలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు సరాబు శివనాథప్రభు, గోళ్ల ప్రసాద్, అడపా రవి, నరేష్, గంగిశెట్టి జగదీష్ పాల్గొన్నారు.

మధిర: మధిర పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో వాసవీమాత జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముందుగా వాసవీమాత పతాకావిష్కరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వాసవీ సహస్రనామ స్తోత్ర పారాయణం, వాసవీ హోమం, పూర్ణాహుతి జరిపారు. ఆలయంలో ఊయల సేవా కార్యక్రమం నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసుల శేషాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ అధ్యక్షులు కపిలవాయి జగన్మోహన్ రావు, కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

తల్లాడ: తల్లాడ ఆర్యవైశ్య కల్యాణ మండపంలో బుధవారం వాసవీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వాసవీ మాతాకు ఆర్యవైశ్య మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తలకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు.

ఏన్కూరు: మండల కేంద్రంలో ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి.. అమ్మవారికి ప్రత్యేక ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా శ్రీపార్థసారథిస్వామి కల్యాణం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని గీతా మందిరంలో గల శ్రీపార్థసారథి స్వామి ఆలయంలో ఆలయ అధ్యయనోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీరుక్మిణి సత్యభామ సమేత పార్థసారథిస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితులు శ్రీరామన్ నల్లాన్ చక్రవర్తుల రామకృష్ణమాచార్యులు ఆధ్వర్యాన కల్యాణఘట్టాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో గుడివాడ వీరరాఘవ వెంకటేశ్వరరావు, తిరునగరి వెంకటనర్సయ్య, కొత్తూరు రాజా, ఏపూరి పురుషోత్తం, చక్రధర్, సుబ్బారావు, పురుషోత్తం, భాస్కర్, రామకృష్ణ, లక్ష్మీ, శిరీష, విజయ, సత్యావతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.


కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

బీటెక్‌లో మిస్ట్ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ పరీక్షా ఫలితాలను ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ బుధవారం విడుదల చేశారు. అత్యధిక ప్రతిభ కనబర్చిన విద్యార్థులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో చీపు జగదీష్, స్వాతి, నాగఇందుమతి పాల్గొన్నారు.

సాయిస్ఫూర్తిలో వర్క్‌షాప్

సత్తుపల్లిరూరల్: గంగారం సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో అన్ని బ్రాంచ్‌ల విద్యార్థులకు బుధవారం పైథాన్ అడ్వాన్స్ టెక్నాలజీపై మూడురోజుల పాటు ప్రొఫెసర్ డాక్టర్ డి.విజయ్‌కుమార్, బి.రాజ్‌కుమార్, టి.నాగసాయి, దాసరి ప్రభాకర్‌లు టెక్నాలజీ సర్వేపై వర్క్‌షాప్ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ షేక్ యాకూబ్, షేక్ మీరాసాహెబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే సింపోజియం

కొణిజర్ల: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి టెక్నికల్ సింపోజియం ఏర్పాటు చేశామని శ్రీ కవిత విద్యాసంస్థల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్ కుమార్ తెలిపారు. తనికెళ్ల సమీపాన విజయ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఆయన టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు సాంకేతికపై అవగాహన పెంచుకుని భవిష్యత్‌లో రాణించాలన్నారు. కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి, ప్రిన్సిపాల్ డాక్టర్ వి.చిన్నయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆయేషా తరుణమ్, డీన్ డాక్టర్ డి.శ్రీనివాసరావు, ఏట డాక్టర్ పెంట్యాల ఫరీద్ బాబా, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

ఆడపిల్లతోనే ఇంటికి పరిపూర్ణత


చింతకాని: రామకృష్ణాపురంలో బాలిక తల్లిదండ్రులకు సన్మానపత్రం అందిస్తున్న డీపీఓ ఆశాలత

మధిర/చింతకాని/బోనకల్/ఎర్రుపాలెం/సత్తుపల్లి టౌన్/తల్లాడ/ఏన్కూరు: ప్రతి ఇంట్లో ఆడపిల్ల ఉంటేనే ఆ ఇంటికి పరిపూర్ణత వస్తుందని డీపీఓ ఆశాలత, మధిర, సత్తుపల్లి, తల్లాడ మండల స్పెషల్ ఆఫీసర్లు శ్రీనివాసరావు, సునీల్‌రెడ్డి, శివకుమార్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, తహసీల్దార్ పున్నం చందర్, మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, ఎంపీడీఓ సత్యనారాయణ తెలిపారు. 'మా ఇంటి మణిదీపం' కార్యక్రమంలో భాగంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని లడక బజారులో షేక్ సుభాని, కరిష్మా దంపతులకు అమ్మాయి పుట్టిన సందర్భంగా తల్లిదండ్రులకు మిఠాయిలు పంపిణీ చేసి వారిని సన్మానించారు. అదే విధంగా సత్తుపల్లిలోని సింగరేణి అంగన్‌వాడీ కేంద్రంలో, చింతకానిలోని రామకృష్ణాపురంలో పాలకుర్తి విష్ణు, సైదాభూషినిలను, బోనకల్‌లోని చొప్పకట్లపాలెం గ్రామంలో షేక్ షాజాహాన్, కుసుంబీ దంపతులను, ఎర్రుపాలెంలోని రేమిడిచర్ల గ్రామంలో, తల్లాడలోని పినపాకలో కారమంచి శిరీష, ఆమె తల్లిదండ్రులు తేళ్లపుట్ల సామ్రాజ్యం, ఆదాంలను, అరెం కిర్తన, అరెం విజయ్ దంపతులను, ఏన్కూరులోని ఒంటిగుడిసె గ్రామంలో బాలిక తల్లిదండ్రులకు పండ్లు, సర్టిఫికెట్లు అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓలు కమలప్రియ, బాల త్రిపుర సుందరి, ఏసీడీపీఓ శివకుమారి, తహసీల్దార్ అనంత రాజు, సూపర్‌వైజర్లు జ్యోతి కుమారి, సుజాత కుమారి, అన్నపూర్ణ, సత్యావతి, రజని, గంగాజలం, పద్మావతి, రమాదేవి, సుజాత, సరిత, సునీత, మధులత, సత్యావతి, రోజా, రత్నకుమారి, వార్డు ఆఫీసర్ షేక్ గౌషాబేగం, ఏఓ సాయిశివ, హెల్త్ సూపర్‌వైజర్లు రేఛల్‌రాణి, స్వర్ణమార్త, ఏఎన్‌ఎం జయమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శులు దుర్గాప్రసాద్, అన్నపూర్ణ, సునీత, మురళి, ఆశ కార్యకర్త ముంతాజ్, అంగన్‌వాడీ టీచర్లు రజని, జయమ్మ, రమాదేవి, భవాని, వైద్య సిబ్బంది లక్ష్మి, లంకా కొండయ్య, సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపుకార్డు తప్పనిసరి


వైరారూరల్: గుర్తింపు కార్డును పరిశీలిస్తున్న ఏడీఏ, ఏఓలు


ఎర్రుపాలెం: మినవోలులో..

వైరారూరల్/ఎర్రుపాలెం: కేంద్ర ప్రభుత్వ పథకాలకు రైతు గుర్తింపు కార్డు తప్పని సరి అని, ప్రతి రైతు ఫోన్‌నంబర్‌తో లింకు అయిన ఆధార్ కార్డు ద్వారా 11 అంకెలతో కూడిన రైతు గుర్తింపు కార్డు పొందాలని ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ , ఏఓ మయామంజూఖాన్ సూచించారు. మండలంలోని గొల్లెనపాడు, తాటిపుడి గ్రామాల్లో రైతు గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. అదే విధంగా ఎర్రుపాలెం మండలంలోని మీనవోలు గ్రామంలో నిర్వహిస్తున్న రైతు నమోదు ప్రక్రియను మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర, ఏఓ బి.సాయి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు క్లస్టర్‌ల వారిగా ఏఓ ల వద్ద రైతు గుర్తింపు కార్డులను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఏఈఓ లు వాసంతి, రాజేష్, సైదులు, కీర్తి, వెంకటనర్సయ్య, సింధూర్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'తో సమస్యల పరిష్కారం


మాట్లాడుతున్న తహసీల్దార్ పున్నం చందర్

బోనకల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టంలో భూ సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని తహసీల్దార్లు పున్నం చందర్, రాంబాబు తెలిపారు. బుధవారం రామాపురం, జానికీపురం గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 87 దరఖాస్తులు అందాయన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూ భారతితో రైతులకు ఉచిత న్యాయ సహాయం అందడంతో పాటు రిజిస్ట్రేషన్, మార్పులు చేర్పులు వంటి సేవలు సులభతరం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు నవీన్, మైథిలీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

మధిర: రైల్వే ప్రైవేటీకరణ ఆపాలని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలని తదితర డిమాండ్లతో ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ.. సీఐటీయూ ఆధ్వర్యంలో మధిర రైల్వే స్టేషన్ మాస్టర్ సుధీర్ బాబుకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు శీలం నరసింహారావు మాట్లాడుతూ.. దక్షిణ మధ్య రైల్వేలో కూడా కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు, బోనస్, కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. ఇటువంటి సమస్యల పరిష్కారానికై సమ్మె చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో గద్దల వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, మేరీ, జ్యోతి, జయమ్మ, దివ్య, రాధాకృష్ణ, మందా సైదులు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా బుచ్చిరామారావు


నూతన కమిటీని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు

వైరా: వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా ఏడునూతల బుచ్చిరామారావు ఎన్నికయ్యారు. వైరాలో బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని పీడీజీ డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాజీ అధ్యక్షుడు చింతలపూడి వెంకటేశ్వరరావు ప్రకటించారు. ఈమేరకు అధ్యక్షుడిగా బుచ్చిరామారావు, ఉపాధ్యక్షులుగా రంగా సత్యనారాయణ, ఏపూరి రాజారావు, కార్యదర్శిగా చెరుకూరి శ్రీనివాసరావు, కోశాధికారిగా గద్దె నీరజ, జీఎస్టీ, జీఎంటీ, జీఈటీ కోఆర్డినేటర్లుగా కన్యధారి హనుమాయమ్మ, కొల్లా రాంబాబు, షేక్ లాల్‌మహ్మద్, పీఆర్ఓగా పులి కృష్ణార్జునరావు ఎన్నికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడగా డైరెక్టర్లు డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, మాదినేని సునీత, లగడపాటి ప్రభాకర్, ఉపేందర్, రమేష్, విశ్వేశ్వరరావు, కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, ప్రసాదరావు, కృష్ణమూర్తి, నాగేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ ప్రాయుడు లక్ష్మీనారాయణ

కొణిజర్ల: జీవించి ఉన్నంత కాలం ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించిన ఆదర్శ నాయకుడు చింతనిప్పు లక్ష్మీనారాయణ అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. బుధవారం చిన్నమునగాలలో లక్ష్మీనారాయణ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హేమంతరావు లక్ష్మీనారాయణ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, నాయకులు బాబు, రమేష్, సుదర్శన్, సామ్సన్, రాంబాబు, సొసైటీ చైర్మన్ చెరకుమల్లి రవి, పరిటాల భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయంలో బహిరంగ వేలం..

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి శ్రీకోట మైసమ్మతల్లి ఆలయంలో నేడు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి వేణుగోపాలాచార్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో కొబ్బెరి కాయలు అమ్ముకొనుట, కొబ్బెరి చిప్పలు ప్రోగు చేసుకొనుట, టెంట్లు సామన్లు అద్దెకు ఇచ్చుట, పూజా సామగ్రి అమ్ముకొనుటకు బహిరంగ వేలం పాటలు నిర్వహించబడుతాయని ఆయన పేర్కొన్నారు. వేలంపాటలో పాల్గొనే పాటాదారుడు పూచికత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని, వేలంలో దక్కించుకున్న కాంట్రాక్టును సంవత్సరం పాటు నడిపించుకోవచ్చునని పేర్కొన్నారు.

నేడు జమలాపురం ఆలయానికి పొంగులేటి రాక

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతి జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఈ నెల 8న ఉదయం 7:30గంటలకు రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సందర్శించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు వెంకటసాయినగర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠ..

కారేపల్లి: కారేపల్లిలోని శ్రీవెంకటసాయినగర్‌లో ఈ నెల 8వ తేదీ నుంచి 12వ తేదీ వరకు బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెంకటసాయినగర్ కమిటీ అధ్యక్ష ,కార్యదర్శులు చాందావత్ లక్ష్మణ్, కల్తి భాస్కర్‌లు బుధవారం తెలిపారు. వేదపండితులు నోముల ఆదినారాయణ, అక్కినపల్లి సంపత్ ఆచార్యులు, చింతోజు బ్రహ్మాచారి, వెంకటస్వామిల శిష్యబృందంచే ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా మహోత్సవం


వైరా: స్వామి చిత్రపటంతో ప్రదర్శన నిర్వహిస్తున్న విశ్వబ్రాహ్మణులు

వైరా: వైరాలోని శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి మందిరంలో స్వామివారి 322 ఆరాధనా మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర కార్యదర్శి రుద్రాక్షల నరసిహాచారి మాట్లాడుతూ.. వీరబ్రహ్మేంద్ర స్వామి లోక కల్యాణం కోసం జీవ సమాధి పొందారన్నారు. అనంతరం వైరా రింగ్ రోడ్డు సెంటర్ నుంచి అయ్యప్పస్వామి దేవాలయం వరకు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. చింతోజు నాగేశ్వరరావు ఇంటి ఆవరణ నుంచి స్వామివారి చిత్రపటాన్ని ధ్వజాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు రుద్రాక్షల నరసింహాచారి, తూమాటి వీరబ్రహ్మాచారి, బండారు అనంతచారి, రంగు శ్రీనివాసచారి, తూమాటి శ్రీరాములు, సజ్జనపు పర్వతాచారి, తాటికొండ నాగేశ్వరరావు, శోభనాచారి, రమణాచారి, వెంకటాచారి అప్పారావు, అర్చకుడు పాపాచారి తదితరులు పాల్గొన్నారు.

విరాట్‌నగర్‌లో..


వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని విరాట్‌నగర్‌లో గల శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు నిర్వహించి.. స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మోహనాచారి, రామకృష్ణమాచార్యులు, ఏడుకొండలు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, అప్పారావు, రవి, రాంబాబు, అప్పాలాచారి, గురుబ్రహ్మాచార్యులు పాల్గొన్నారు.

బోనకల్‌లో..


బోనకల్‌లో..

బోనకల్: మండలంలోని విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మం, గోవిందమాంబ వారి ఆరాధన కార్యక్రమం నిర్వహించారు. మండల అధ్యక్షుడు రావుట్ల వెంకటాచారి మాట్లాడారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు సత్యనారాయణ, శ్రీనివాసరావు, సతీష్, బ్రహ్మం, రామాచారి, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.